వైభవంగా శ్రీకృష్ణుడి రథయాత్ర



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యనగర్‌లో శ్రీకృష్ణుడి రథ యాత్ర జరిగింది. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, గుర్రాలతో బ్లూహెవెన్ బార్ మీదుగా ఆరోరా కళాశాల తదితర ప్రాంతాల్లో రథ యాత్ర శోభాయమానంగా సాగింది. ఈ రథ యాత్రలో కాంగ్రెస్ సీనియర్ నేత కాసాని ఆనంద్, సామాజికవేత్త రాయపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: పేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌కు చెందిన మాజీద్ హుస్సేన్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అంజన్‌కుమార్‌యాదవ్ అందజేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే పేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

24న వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో ఈనెల 24న కాపు, బలిజ, తెలగ, మున్నూరుకాపు సామాజికవర్గాల వారి కోసం వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు కోటేశ్వర్‌రావు తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా మాట్లాడుకుని పెళ్లి సంబంధాలు కుదుర్చుకోవచ్చని ఆయన తెలిపారు.

రైలులో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైలులో ల్యాప్‌టాప్ చోరీ జరిగిన ఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... చెన్నైకి చెందిన సీతా గణేష్ (54) కాచిగూడకు రావడానికి చెన్నై ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలు మహబూబ్‌నగర్ రాగానే ల్యాప్‌టాప్ బ్యాగ్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం.!



కృష్ణానగర్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేసే ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కాచిగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఘనంగా నిర్వహించేందుకు భక్తులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాలు ఏర్పాటు చేసే స్థలం వద్ద చెత్త కుప్పలు పేరుకుపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. విజ్ఞప్తి చేసినా చెత్తాచెదారాన్ని తొలగించడం లేదని చెబుతున్నారు. మండపాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శుభాకాంక్షలు

చిక్కడపల్లి: గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో కార్పొరేటర్ పావని జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆమెను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, సంధ్యారాణి, మంగమ్మ, లావణ్య, సంయుక్తరాణి, స్వప్న, పూర్ణ, కృష్ణవేణి, అనూష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ పావనిని సన్మానిస్తున్న మహిళా మోర్చా నాయకులు

సమన్వయంతో ముందుకు.!

- మూసీ పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తమైన అధికారులు
- వరద సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు
- రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా చర్యలు



అక్రమ నిర్మాణం వద్ద మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతాల్లో వరద సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్ పేర్కొన్నారు. మంగళవారం ముసారంబాగ్, గోల్నాక మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. మూసీ వరదలతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది, ఏఎంహెచ్ఓ డా. హేమలత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు..

అంబర్‌పేట: అక్రమ నిర్మాణలపై జీహెచ్ఎంసీ సర్కిల్-16 అధికారులు కొరడా ఝులిపించారు. బర్కత్‌పురలోని ఓ భవన నిర్మాణదారుడు అనుమతులకు మించి నిర్మాణం చేపట్టడంతో మంగళవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. డీఎంసీ మారుతీదివాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన అదనపు అంతస్తును తొలగించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణల పట్ల చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆయన వెల్లడించారు. నిర్మాణదారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. పారదర్శంగా అనుమనులు పొంది నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మూసీ పరీవాహక ప్రాంతంలో సమస్యలను పరిశీలిస్తున్న డీఎంసీ, ఏఎంహెచ్ఓ

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే ముఠాగోపాల్



శ్రీరామ్‌నగర్ బస్తీలోని లోతట్టు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎడతెరిపిలేని వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో వాటర్‌వార్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం మోహన్‌రాజ్, డీఈ గీత తదితర అధికారులతో కలిసి పర్యటించారు. శ్రీరామ్‌నగర్ బస్తీలో వరద తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సత్యనారాయణ, కృష్ణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచుతూ జీవో జారీ చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీయూసీఐ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెంచుతూ వెంటనే జీవో విడుదల చేయాలని టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, కార్యదర్శి ఎస్.ఎల్.పద్మలు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలను పెండింగ్‌లో ఉంచారని తెలిపారు. ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కూడా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలన్నారు. పనిభారం తగ్గించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బేసిక్ వేతనం రూ.18 వేలకు నిర్ణయించి పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ, ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.నరేందర్, ఎం.అన్వేష్, జి.రామయ్య, కె.రాజన్న, వి.ప్రవీణ్, అరుణ్‌కుమార్, వెంకట్, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం నినాదంతో..

పంజగుట్ట: గ్రామగ్రామంలో రాజ్యాంగం అనే నినాదంతో ప్రతి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్లలో రాజ్యాంగం ప్రతిని, అంబేడ్కర్, పూలే పుస్తకాలను పంపిణీ చేస్తామని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాఖ్య ప్రతినిధులతో కలిసి రాజ్యాంగం ప్రతిని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య కన్వీనర్ రామకృష్ణ కెతావత్, మహిళా కో కన్వీనర్లు సుశీలా కుమారి, చంద్ర ప్రభతో కలిసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేలకు పైగా గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, అంబేడ్కర్, పూలే చరిత్రలతో ఉన్న పుస్తకాలు అందజేస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ ప్రోగ్రాం యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో డీపీఓ రుకుముద్దీన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. త్వరలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీపీఎం యూనిట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

మార్వాడీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

ఏబీఏఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్



కాచిగూడ: మార్వాడీలకు వారి వ్యాపారాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అఖిల భారతీయ అగర్వాల్ మహాసభ (ఏబీఏఎం) రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... మార్వాడీలకు భద్రత కల్పించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, డీజీపీలను కలిసి వినతి పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. మార్వాడీలపై బెదిరింపులకు పాల్పడుతూ వ్యాపారాలు చేసుకోకుండా అడ్డుకుంటున్న వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్వాడీలపై ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నిజాం నవాబుల పాలనలో తాతల, ముత్తాతల కాలం నుంచి ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి ఇక్కడే జీవితాలను ముగిస్తున్నామని, ఇప్పుడు కొంత మంది పనిగట్టుకుని గో బ్యాక్ అంటే భయపడేది లేదని ఆయన అన్నారు. తాము తెలంగాణ బిడ్డలమేనని, తమను వెళ్లి పోవాలని అనే హక్కు ఎవరికి లేదన్నారు. దేశంలో ఎక్కడైనా జీవించే హక్కు, స్వేచ్ఛను భారత రాజ్యాంగం అందరికీ కల్పించిందని తెలిపారు. మార్వాడీల రక్షణ కోసం హెల్ప్‌లైన్, టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గణేష్ చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం




బీజీయూఎస్ అంబర్‌పేట, ముషీరాబాద్ అసెంబ్లీల కన్వీనర్లుగా నియామక పత్రం అందుకుంటున్న రమేష్, శివాజీ

అంబర్‌పేట: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్‌గా అచ్చిని రమేష్ నియమితులయ్యారు. మంగళవారం ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, ఆలె భాస్కర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అచ్చిని రమేష్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో గణేష్ నవరాత్రులు వైభవంగా జరిగేలా నిర్వాహకులు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య సమన్వయం చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు ఆనంద్‌గౌడ్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చుక్కా జగన్, వెంకటేశ్, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజీయూఎస్ ముషీరాబాద్ కన్వీనర్‌గా శివాజీ..

ముషీరాబాద్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా మద్దూరి శివాజీ నియమితులయ్యారు. మంగళవారం బీజీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైకుంఠం, కార్యదర్శి ఆలే భాస్కర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అసెంబ్లీ కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర నాయకత్వానికి శివాజీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వినయ్, మహేంద్రబాబు, శక్తిసింగ్, బుర్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మహిళా మోర్చా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలను వివరిస్తూ పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయడానికి మహిళలు కృషి చేయాలని డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గ మహిళా మోర్చా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గంలో మహిళలు పార్టీలో అధిక సంఖ్యలో చేరేలా మహిళా మోర్చా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో అంబర్‌పేట నియోజకవర్గం ఒకటని అన్నారు. అంబర్‌పేటలో మహిళా కార్యకర్తలంతా కలిసి పనిచేస్తే పార్టీ మరింత శక్తివంతంగా తయారవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.అమృత, మహిళా మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతి, పార్టీ నేతలు ఎడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, ఎక్కాల నందు, మూల రవీందర్‌గౌడ్, మహిళా మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలి

ముషీరాబాద్: రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చని మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ముషీరాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం ఆయనను కలిసి ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ... ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, సదా, కాంచిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



వైభవనగర్‌లో నాలా సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నాలా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. వర్షం పడినా ప్రతిసారి సమస్య తలెత్తడం పట్ల ఎమ్మెల్యే అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట వైభవనగర్ గాయత్రి టవర్స్ వద్ద వర్షపు నీటితో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలు అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. ప్రధానంగా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో సమస్యలపై దృష్టి సారించాలన్నారు. నాలా విస్తరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నాలాల్లోని పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వర్షపునీరు నిలువకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీ.వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పది రోజులుగా ఇలాగే..!



గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో పదిరోజులుగా చెత్తను తొలగించకపోవడంతో పేరుకుపోయింది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. – చిక్కడపల్లి

ఘనంగా నర్సింగ్‌రావుగౌడ్ జయంతి



నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.నర్సింగ్‌రావుగౌడ్ ఎంతో కృషి చేశారని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుషాల్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.నర్సింగ్‌రావుగౌడ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బండారు దత్తాత్రేయ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, ఎం.నవీన్‌గౌడ్, కంచి ముదిరాజ్, వినుత, నందు, ప్రవీణ్, అనిల్, సాయి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి
- మండపాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచన
- నిర్వాహకుల ఫోన్ నంబర్లు అధికారులకు ఇవ్వాలని విజ్ఞప్తి
- సమావేశానికి హాజరైన పోలీసులు, మండప నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధులు



మండప నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధులతో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి, పోలీసులు

ముషీరాబాద్: వినాయక చవితి ఉత్సవాలను భక్తి భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. సెంట్రల్ పీస్ కమిటీ, ఈస్ట్‌జోన్ పోలీసులు మంగళవారం అడిక్‌మెట్, లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్నేహ బంధం, ఐకత్య పెంపొందించడానికి నాడు బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రారంభించారని అన్నారు. అదే స్ఫూర్తితో అందరూ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగలు జరుపుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకుల ఫోన్ నంబర్లు, పేర్లను అధికారులకు తప్పనిసరిగా అందజేయాలన్నారు. గణపతి ఉత్సవ నిర్వాహకులు మండపాల ఏర్పాటులో భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. విద్యుత్ కేబుల్స్ వాడాలన్నారు. టేపులను ఉపయోగించాలని, గ్లౌజేస్ ధరించాలని, అవసరమైన సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీలు ఎ.మట్టయ్య, హరీష్‌కుమార్, శశాంక్‌రెడ్డి, వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యామ్, డాక్టర్ యూనుస్, మధుసూదన్ సోమాని, ఫరీదుద్దీన్, డాక్టర్ మజారోద్దీన్, బసంత్‌కౌర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు దూరంగా మండపాలను ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు



ముషీరాబాద్: త్వరలో జరగనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసే మండపాలను విద్యుత్ తీగలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కోరారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గణేష మండపాల ఏర్పాటులో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిర్వాహకులు విద్యుత్, అగ్నిమాపక శాఖ, పోలీసుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో ఆగమనం పేరుతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించొద్దని కోరారు. అనుమానితుల పట్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డీజే పెట్టొద్దని సూచించారు.